# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-12-2024** **సమయం : 3.15 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలోని బాలల మెరుగైన భవిష్యత్తుకు ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరముందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.**
2. **బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగల్ ధైర్య సాహసాలు, త్యాగాలు నేటికీ స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
3. **విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**
4. **సహకార సంఘాలకు ఆర్థిక చేయూతని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈ నెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

దేశంలోని బాలలకు సురక్షితమైన బాల్యం అందించడంతో పాటు, మెరుగైన భవిష్యత్తుకు ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరముందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ 'కార్యక్రమంలో ఏడు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన 14 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 17 మంది చిన్నారులకు రాష్ట్రపతి బాలపురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ,

వాయిస్ (34 సెకన్లు)

కళ, సంస్కృతి, శౌర్యం, ఆవిష్కరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడలు, పర్యావరణంలో సాధించిన విజయాల కోసం కేంద్ర ప్రభుత్వం బాల పురస్కారాలను అందజేస్తోంది. కాగా రాష్టంలోని గుంటూరుకు చెందిన ఎం. జెస్సి రాజ్ క్రీడా విభాగంలో పురస్కారాన్ని అందుకున్నారు.

---

బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగల్ ధైర్య, సాహసాలు, త్యాగాలు నేటికి స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు " వీర బాల దివస్" కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని భారత్

మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

..వాయిస్... 30 సెకన్లు

ఇది ఇలా ఉండగా.. పోషకాహార సంబంధిత సేవల అమలును విస్తృతం చేసేందుకు ఉద్దేశించిన 'సుపోషిత్ గ్రామ పంచాయితీ అభియాన్'ను ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు.

---------------------------

విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అమరావతిలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, పెంచిన వారే ఇప్పుడు ధర్నాకు పిలుపునివ్వడం హాస్యాస్పదమని మంత్రి విమర్శించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా, వారి ఇతర వివరాలపై సామాజిక ఆడిట్‌ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎస్సీ కులగణనకు సంబంధించి పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉప కులం, స్వచ్ఛాలయాల సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం వంటి వివరాలను ఈరోజు నుంచి గ్రామ వార్డు సచివాలయంలో ప్రదర్శిస్తున్నామని చెప్పారు. ఈ నెల 31వ తేదీ వరకు దీనిపై అభ్యంతరాలు స్వీకరిస్తామని, జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని అధికారులు చెప్పారు.

---------------------------

రాష్ట్రంలోని పాఠశాలలకు జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా పలు జిల్లాల్లో పాఠశాలలకు స్థానికంగా సెలవులు ఇచ్చినందున జనవరి 11 నుండి 15వ తేదీ లేదా 12 నుండి 16 తేదీల్లో మాత్రమే సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో వాస్తవం లేదని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, టెక్కలిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు 'అంతర విశ్వవిద్యాలయ ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనం' నిర్వహిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. భారతీయ విజ్ఞాన పరిరక్షణ, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఇందులో భాగంగా స్వదేశీ గిరిజనుల జీవనవిధానాలపై రూపొందించిన చిత్ర ప్రదర్శనలు, పరిశోధనలు, సదస్సులు, సామాజిక ప్రచార కార్యక్రమాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, శిక్షణ, సమాచార మార్పిడి తదితర అంశాలపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

పశుగ్రాస పెంపకం దారులకు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ- ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా

తాడేపల్లిలో నిన్న నిర్వహించిన సహకార్ సే సమృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఉత్తమ పాడి రైతులు, పాల సంఘాలు, మత్స్యకార సంఘాలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకార సంఘాల ద్వారా సభ్యులకు పడవలు, వలలు, చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సహకార సంఘాలకు ఆర్థిక చేయూతనందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో విశాఖపట్నం-అరకు మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం- అరకు- విశాఖపట్నం ప్రత్యేక రైళ్లు ప్రతీ శని, ఆదివారాల్లో విశాఖపట్నంలో ఉదయం 8 గంటల 30 నిమిషాలకు బయల్దేరి అదే రోజు ఉదయం 11 గంటల 45 నిమిషాలకు అరకు చేరుకుంటాయని తెలిపారు. తిరుగు ప్రయాణంలో అరకులో ప్రతీ శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంటాయని ఈ రైళ్లు ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నడుస్తాయని వెల్లడించారు.

---------------------------

ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ ఇంటి పైకప్పు నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. సౌర పలకాలను పొందేవారికి ప్రభుత్వం రాయితీని అందిస్తోందని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ ( 24 సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

అఖిల భారతీయ సైనిక పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశ పరీక్షకు జాతీయ పరీక్ష సంస్థ- ఎన్టీఏ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ పరీక్షకు జనవరి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఆరో తరగతిలో ప్రవేశానికి మార్చి 31వ తేదీ నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్య వయసు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని, 8వ తరగతి పాస్ అయి, 11 నుంచి 15 ఏళ్ల మధ్య వయసున్న వారు 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్ సైటును సంప్రదించాలని సూచించింది.

---------------------------

రాష్ట్ర రాజకీయాల్లో వంగవీటి మోహనరంగాకు ఒక ప్రత్యేక స్థానముందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాది విష్ణు అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకుని ఈరోజు విజయవాడలో

ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. శాసన సభ్యులుగా మోహనరంగా విజయవాడ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని కొనియాడారు.

======================